క్లుప్తంగా

అంబలి కేంద్రం ప్రారంభం



మరికల్: మండలంలోని పల్లెగడ్డలో వ్యవసాయ కూలీలు, బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం బుధవారం దాతలు రాములు, లక్ష్మయ్య, నాగరాజు అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. పల్లెగడ్డకు చెందిన ఆశన్న జ్ఞాపకార్థం ఆయన కుమారులు వరుసగా మూడో ఏడాది కూడా గ్రామంలో అంబలి కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ



మరికల్: మండలంలోని ఎలిగండ్లకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హన్మంతు అనారోగ్యంతో బాధపడుతుండటంతో బుధవారం పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి ఆయనను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్ కింద ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరన్న, సూర్యమోహన్, హరీష్, చిన్నబాలు, ఆంజనేయులు, ఆనంద్, రఘు, అనిల్, చెన్నయ్య పాల్గొన్నారు.

మాదిగల హక్కులు కాలరాస్తే గుణపాఠం



మరికల్: మాదిగల హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ నుంచి పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థులను ఓడిస్తామని ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ సమన్వయకర్త బాలరాజ్ అన్నారు. మరికల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఒక్క ఎంపీ టికెట్ మాదిగలకు ఇవ్వలేదని, బీజేపీ మూడు టిక్కెట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. అలాగే మాదిగల వర్గీకరణకు కూడా బీజేపీ కట్టుబడి ఉందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి అరుణమ్మ గెలిపించేందుకు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాములు, కర్రెప్ప, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

గురు పరంపరతోనే జ్ఞాన సాధన

దామరగిద్ద: గురు పరంపరతోనే ఆధ్యాత్మిక జ్ఞానం, జ్ఞాన సాధనతోనే మోక్షమార్గం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా రాజ్యవిద్యాశ్రమ మఠాధిపతి పూజ్య శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి అన్నారు. బుధవారం మండలంలోని మద్దెల్‌బీడ్‌లోని రాజ్యవిద్యాశ్రమ ఆశ్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు వడ్ల బస్సప్ప ఆధ్వర్యంలో భక్తులు గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన స్వామిజీ పాదపూజ అనంతరం మాట్లాడుతూ ఆత్మ జ్ఞాన సాధనతోనే జీవిత పరమార్థాన్ని పొందుతామన్నారు. భగవద్గీతను చదవడం, వినడం ద్వారా పొందే జ్ఞానం మానవ వికాసానికి ఆధ్యాత్మిక, ఆత్మజ్ఞానాన్ని పొందడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం స్వామిజీని ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ భక్తులు, బాలప్ప, కిష్టప్ప, హన్మంతు, బస్సప్ప, భగవంతు, శరణమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

ధన్వాడ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రారంభించారు. కొన్నేళ్లుగా పాత బాలికల పాఠశాలలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగిస్తున్నారు. గతేడాది నూతన భవనం మంజూరు కావడంతో నేటితో పనులు పూర్తవగా కాంట్రాక్టర్ అధికారులకు భవనాన్ని అప్పగించారు. ఉదయం తహసీల్దార్ సింధూజ వాస్తు పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేయలేదు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత శిలాఫలకం ఏర్పాటు చేయనున్నారు.

స్కిప్పింగ్ పోటీలు

మక్తల్: జాతీయ స్కిప్పింగ్ డే సందర్భంగా పట్టణంలోని మినీ స్టేడియంలో బుధవారం విద్యార్థులకు స్కిప్పింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గోపాలం మాట్లాడుతూ జాతీయ స్కిప్పింగ్ డే లో బాలికలు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. తన సొంత డబ్బులతో ఈ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు, మెమొంటోలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బొనేశ్వర్లు హాజరై బాలికలకు బహుమతులను అందించారు.

'సర్కార్' విద్యార్థుల ప్రతిభ



సోనియా (481) మహేశ్వరి (927) రాజేశ్వరి, 969 (బైపీసీ) అక్షయ, 427 (బైపీసీ) నవనీత, 457 (ఎంపీసీ)

ఉమేష్‌గౌడ్ (946) ఎంపీసీ మల్లేష్ (924) బైపీసీ నితిన్‌కుమార్‌గౌడ్ (967) ఎంపీసీ శిరీష (444) ఎంపీసీ శ్రావణి (404) బైపీసీ

కోస్గి: ఇంటర్ ఫలితాల్లో గుండుమాల్ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. బైపీసీలో రాజేశ్వరి 969 మార్కులు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో అక్షయ 440 మార్కులకు గాను 427 మార్కులు, ఎంపీసీలో 470 మార్కులకు గాను నవనీత 457 మార్కులతో ప్రతిభ చూపి టాపర్లుగా నిలిచారు. ఇదే క్రమంలో కోస్గి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహేక్ ఫాతీమా సీఈసీలో 963 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

కేజీబీవీ విద్యార్థులు

కృష్ణా: మండలంలోని హిందూపూర్ శివారులో గల కేజీబీవీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. ఎస్ఓ షాలిని బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మొత్తం కళాశాలలో 81 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 61 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 37 మంది పరీక్షలు రాయగా అందులో 30 మంది, ఇంటర్ మొదటి సంవత్సరంలో 44 మంది విద్యార్థులకు 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

మాగనూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలు మిశ్రమంగా వచ్చాయి. మొదటి సంవత్సరంలో 113 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 30 మంది, ద్వితీయ సంవత్సరంలో 71 మందికి గాను 36 మంది ఉత్తీర్ణత సాధించారు. సీఈసీ ద్వితీయ సంవత్సరంలో 19 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా కేవలం ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం సీఈసీ టాపర్‌గా శివకుమార్ 554 మార్కులు సాధించాడు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో నందిని 910 మార్కులు, మొదటి సంవత్సరం బైపీసీలో రజియాబేగం 419 మార్కులు, సీఈసీ మొదటి సంవత్సరంలో 481 మార్కులతో సోనియా మండల టాపర్‌గా నిలిచారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రావు విద్యార్థులను అభినందించారు.

బైపీసీలో..

దామరగిద్ద: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పిడెంపల్లి గ్రామానికి చెందిన ఉమేష్ గౌడ్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 1000 మార్కులు గాను 946 మార్కులు, దామరగిద్దకు చెందిన మల్లేష్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 924 మార్కులు సాధించారు. కళాశాలలో ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 126 మంది పరీక్షలు రాయగా 34 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించగా.. ద్వితీయ సంవత్సరంలో 81 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 51 మందితో 63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.

ధన్వాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదువుతున్న విద్యార్థి నితిన్‌కుమార్‌గౌడ్ 967 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడు. కుర్వ మల్లేష్ హెచ్ఈసీలో 462 మార్కులు సాధించాడు. కళాశాలలో మొదటి సంవత్సరంలో కేవలం 18శాతం, రెండో సంవత్సరంలో 34శాతం విద్యార్థులు పాస్ అయ్యారు.

తెలంగాణ మోడల్ పాఠశాలలో..

మోడల్ పాఠశాలలో 76 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 40 మంది విద్యార్థులు పాసయ్యారు. ఎంపీసీలో శ్వేత 954 మార్కులు, బైపీసీలో భవిత 900 మార్కులు, కళ్యాణి సీఈసీలో 767 మార్కులు సాధించారు.

కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలలో..

మొదటి సంవత్సరంలో 94శాతం, రెండో సంవత్సరంలో 94శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో వి.ఉమేష్ 943, బైపీసీలో అశోక్ 976, ఒకేషనల్‌లో రాజేష్ 969 మార్కులు వచ్చాయని అధ్యాపకులు తెలిపారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో..

మొదటి సంవత్సరం ఎంపీసీలో శిరీష 444 మార్కులు, బైపీసీలో శ్రావణి 404 మార్కులు సాధించింది. రెండో సంవత్సరం ఎంపీసీలో అనూష 903 మార్కులు, బైపీసీలో అశ్విని 989 మార్కులు సాధించారు.

ఊట్కూరు టాపర్‌గా అఖిల..

ఊట్కూరు: ఊట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపీసీలో అఖిల 934 మార్కులు సాధించి కాలేజీ టాపర్‌గా నిలిచిందని బుధవారం అధ్యాపకుడు సత్యనారాయణ తెలిపారు. ద్వితీయ స్థానంలో భవాని 927, తృతీయ స్థానంలో అమృత 924 మార్కులు, సీఈసీ ద్వితీయ సంవత్సరంలో భవాని 755, బాలరాజు 520, శివశంకర్ 511, బైపీసీ మొదటి సంవత్సరంలో లక్ష్మి 356, అశ్విని 348, అక్షయ 335, సీఈసీ మొదటి సంవత్సరంలో నవనీత 363, శ్రీనివాస్ 357, మోనేష్ 318 మార్కులు సాధించారు.

మక్తల్: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం ఎంపీసీలో రాధ 396, సీహెచ్ ప్రవీన్ 393, బైపీసీలో జ్యోతి 398, అశోక్ 388, రెండో సంవత్సరం ఎంపీసీ విభాగంలో సురేష్ 792, అనిల్ 748, హన్మంతు 748, సీఈసీ మొదటి సంవత్సరంలో జ్యోతి 408, శివం 361, రెండో సంవత్సరం బీమేష్ 886 మార్కులు సాధించారు.

ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు



అజామత్‌తాంకిన్ (ఎంపీసీ 988) మీరజ్ టబాస్సుమ్ (బైపీసీ 988) ప్రగతి (సీఈసీ 950) లావణ్య (ఎంపీసీ 949) మమత (బైపీసీ 977)



భాస్కర్ (సీఈసీ 882) మౌనిక (హెచ్ఈసీ 934)

నారాయణపేట రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్‌కు దీటుగా మార్కులు సాధించారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం వారీగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ విభాగాల్లో బోధన జరుగుతుంది. మొదటి సంవత్సరం 243మంది పరీక్షకు హాజరు కాగా 95మంది, ద్వితీయ సంవత్సరంలో 202 మందికి గాను 103 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కవలలు సఫరానూరేన్ 959, తహేర్ నూరేన్ 915మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో ఫాతిమా బేగం 916, తహసీన్ ఫాతిమా 913మార్కులతో అదరగొట్టారు. శ్రీసాయి కళాశాలలో మొదటి సంవత్సరంలో ఎంపీసీలో మహతీశ్రీ 465, మహ్మద్ ఫర్హాన్ అహ్మద్ 461, బైపీసీలో అంజూమ్ 434, లఫ్సాన్ తబాసుమ్, అహెషా మహేన్, సదాస్ సనోబెర్ 429మార్కులు సాధించారు. సీఈసీలో 500కి గాను మైథిలి 459, లక్ష్మి 450, ఎంఈసీలో వేదశ్రీ 466 సాధించినట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో అజామత్‌తాంకిన్ 988, దీపిక 985, బైపీసీలో మీరజ్ టబాస్సుమ్ 988, ఫిపఅంజూమ్ 971, సీఈసీలో ప్రగతి 950 సాధించారు.

శ్రీవేదసరస్వతి కళాశాలలో..

మొదటి సంవత్సరం ఎంపీసీలో శిరీష 454, బైపీసీలో రాకేష్‌కుమార్ 421, సీఈసీలో జ్ఞానేశ్వరీ 461, హెచ్ఈసీలో గోపాల్ 473 సాధించారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరంలో లావణ్య 949, బైపీసీలో మమత 977, సీఈసీలో భాస్కర్ 882, హెచ్ఈసీలో మౌనిక 934లు సాధించినట్లు ప్రిన్సిపాల్ శేషమ్మ తెలపారు.

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'



జిన్నారంలో వ్యవసాయ పొలాల వద్ద ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



బీజేపీలో చేరిన బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డికి కండువా కప్పుతున్న డీకే అరుణ

మరికల్: బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ విజయం కోసం జిన్నారంలో బీజేపీ నాయకులు బుధవారం వ్యవసాయ పొలాల వద్ద పనులకు వెళ్లిన రైతులు, కూలీలను కలిసి ప్రచారం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ రైతులు, కూలీల అభ్యున్నతి కోసం చేపట్టిన పథకాలను వారికి వివరించారు. మండల కేంద్రంలో, ఎలిగండ్ల, అప్పంపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వీరరాఘవరెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, రమేష్, గోపాల్, శ్రీరామ్ పాల్గొన్నారు.

మాగనూర్: బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సుమన్ మాట్లాడుతూ.. ఫిర్ ఏక్‌బార్ నరేంద్రమోదీని ప్రధానమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రజలు బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో భీమ్‌రాజు, యాదవ్, పరశురాం, వాబయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

నర్వ: మండలానికి చెందిన టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి బుధవారం కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె బీజేపీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో దేశం గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. దేశంలో సుస్థిరమైన ప్రభుత్వ ఏర్పాటు కోసం మరోసారి బీజేపీని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహబూబ్‌నగర్ బీజేపీ పార్లమెంటు అభ్యర్థిగా డీకె అరుణ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా తనతో పాటు ముఖ్య అనుచరుడు అజిత్‌సంహారెడ్డి పార్టీలో చేరారు.

సైన్స్ సెమినార్‌కు ముశ్రీఫా ఉపాధ్యాయుడు



కోస్గి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణ సంస్థ సహకారంతో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు మండలంలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వార్ల మల్లేశం సమర్పించిన పరిశోధన పత్రాలు ఎంపికయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ఉపాధ్యాయ శిక్షణ, పరిశోధన సంస్థ డైరెక్టర్ ద్వారా ఉత్తర్వులు వెలువడినట్లు మల్లేశం తెలిపారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ ఆడిటోరియంలో ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మల్లేశం ఎంపికపై పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలి

మరికల్: వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, ప్రధాన కార్యదర్శి రఘు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలకు ఇచ్చిన 45 రోజుల సెలవులు అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా వర్తింపజేయాలని వారు కోరారు. లేకుంటే ఎండల ప్రభావం కారణంగా చిన్నారులు వడదెబ్బకు గురై అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి వారికి సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పరస్పర దాడులు: కేసులు నమోదు

కొత్తకోట (ఆత్మకూర్): మున్సిపాలిటీ కేంద్రంలోని బీసీకాలనీలో పరస్పర దాడులకు పాల్పడిన యువకులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఈమేరకు బుధవారం బీసీ కాలనీలో సీఐ, ఎస్ఐ బృందం విచారణ చేపట్టారు. మూడు రోజుల క్రితం రేవల్లి శ్రీను, అదే కాలనీకి చెందిన గడ్డమీది శ్రీనివాసులు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఘటనలో గడ్డమీది శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. తనను కులంపేరుతో దూషించాడని రేవల్లి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు, దాడి ఘటనలో గడ్డమీది శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదులపై కాలనీలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. డీఎస్పీ విచారణ అనంతరం పూర్తి వివరాలను తెలుపుతామని సీఐ తెలిపారు.

అంగన్‌వాడీ చిన్నారుల బాలమేళ



చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్లు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో బాలమేళ నిర్వహించి వార్షికోత్సవాన్ని జరుపుకొన్నారు. బుధవారం గ్రామంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులతో కలిసి ప్రీస్కూల్ వార్షికోత్సవం చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మమ్మ, అనురాధ, స్వరాజ్యలక్ష్మి, అనంతమ్మ, సూర్యకాంతం ఆధ్వర్యంలో చిన్నారులకు బోధన ఉపకరణాలతో చదవడం, రాయడం, ఆటపాటలను నేర్పించారు. గర్భిణులకు, బాలింతలకు, తక్కువ బరువు ఉన్న వారి ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అంజనీ పుత్రా.. పాహిమాం



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూర్: హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని గురువలింగంపల్లిలో గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో రథోత్సవం బుధవారం తెల్లవారుజామున భక్తుల నడుమ అంగరంగవైభవంగా నిర్వహించారు. అంతకు ముందు రథానికి పూజలు చేశారు. పురోహితులు వేదమంత్రాలు, కాగడాల మధ్య ఊరేగింపుగా తెచ్చి స్వామి వారి విగ్రహాన్ని రథంలో ఉంచారు. అనంతరం భక్తులు మైదానంలో తేరును లాగారు. రథోత్సవాన్ని తిలకించడానికి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రథోత్సవంలో తాజా, మాజీ ఎమ్మెల్యేలు

గురువలింగంపల్లిలో ఆంజనేయస్వామి రథోత్సవం కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కుటుంబ సమేతంగా విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సైతం బీఆర్ఎస్ నాయకులతో కలిసి రథోత్సవంలో పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం



గుడెబల్లూర్ వేంకటేశ్వర స్వామివారి రథోత్సవం లాగుతున్న భక్తులు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున స్వయంభు లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని వేలాది మంది భక్తులు, వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలతో కనులపండువగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణ, అభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం 5గంటలకు పాల ఉట్టిని పగలకొట్టారు. భజన మండలి సభ్యులు భజన గీతాలు ఆలపించారు. ఉత్సవాలకు స్థానికులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండగా నిర్వాహకులు తాగునీరు, వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

హాజరైన ఎమ్మెల్యే

వేంకటేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు మంత్రోచ్చరణలతో స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించి వారిని ఆశీర్వదించారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు కొత్తకోట సిద్ధార్థరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆశిరెడ్డి, శివరాజ్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళా హక్కులపై పోరాడదాం'



మాట్లాడుతున్న నాయకులు

ఊట్కూరు: మహిళా హక్కులు, వారి సమానత్వం కోసం పోరాడదామని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు శారద అన్నారు. బుధవారం మండలంలోని బిజ్వార్ ప్రజాపంథా కార్యాలయంలో పీఓడబ్ల్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో సగ భాగమైన మహిళలు సామాజికంగా కుల, మత, లింగ వివక్షతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సాంఘీక దురాచారాలకు వ్యతిరేకంగా ఎందరో సంఘసంస్కర్తలు ఉద్యమాలు చేపట్టినా.. సంపూర్ణ ఫలితం దక్కలేదన్నారు. ఇంకా మహిళలను అనిచివేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని వాపోయారు. నిత్యవసర సరుకుల ధరలు పెరిగిపోతుండడంతో శ్రామికుల జీవనం దుర్భరంగా మారుతుంన్నారు. సమాజంలో మార్పు కోసం మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సావిత్రమ్మ, జిల్లా కమిటీ సభ్యురాలు ఎల్లమ్మ, పద్మమ్మ, గాయిత్రి, నాయకులు సలీం, కిష్టారెడ్డి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కవాతు



మాద్వార్‌లో కవాతు చేస్తున్న పోలీసులు, సాయుధ బలగాలు

మక్తల్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకే పోలీస్ కవాతు నిర్వహిస్తున్నామని మక్తల్ ఎస్ఐ లక్ష్మీరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సోమేశ్వర్‌బండ, మాద్వార్ గ్రామాల్లో లోక్ సభ ఎన్నికల నిర్వహణ, అవగాహన కోసం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమస్యాత్మకంగా ఉన్న గ్రామాల్లో పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ చేశారు. ప్రజలందరికీ పోలీసులు అండగా ఉంటారని, ఓటర్లందరూ నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో మక్తల్ ఎస్ఐ2 ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చింతలరాయస్వామి ఉత్సవాలు



ఎమ్మెల్యేకు సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలో మూడు రోజులుగా స్వయంభుగా వెలిసిన చింతలరాయస్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. చివరి రోజైన బుధవారం జాతరతో ఉత్సవాలు ముగిశాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత స్వామివారి రథోత్సవం కనులపండువగా చేపట్టారు. ఉత్సవమూర్తులను చక్కగా అలంకరించి రథంపై కూర్చొబెట్టి యువకులు పోటాపోటీగా తాడును లాగారు. అంతకుముందు స్వామివారి ఉద్దాలోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అర్చన, హారతి కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, నాగిరెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

జోరందుకున్న ఉల్లి వ్యాపారం

- క్వింటాల్ గరిష్టంగా రూ.1,600.. కనిష్టంగా రూ.1,200



మార్కెట్‌లో ఉల్లి కొంటున్న వినియోగదారులు

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. రెండు వారాలుగా ఉల్లి వేలం వేయకపోవడంతో ఈసారి వినియోగదారులు పెద్దఎత్తున మార్కెట్‌కు తరలివచ్చారు. మార్కెట్‌కు వందలాది మంది రైతులు ఉల్లిని అమ్మకానికి తేవడంతో వ్యాపారులు వేలం వేయకుండానే సగానికి సగం ఉల్లిని ముందుగానే కొనుగోలు చేశారు. మిగిలిన కుప్పలకు మధ్యాహ్నం వరకు వేలం జరిగింది. నిల్వ చేసుకోవడానికి చాలామంది వినియోగదారులు బస్తాలుగా కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చిన ఉల్లి నాణ్యతగా ఉండడంతో మార్కెట్‌కు దాదాపు 2 వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది.

45 కిలోల బస్తా రూ.800

మార్కెట్‌లో 45 కిలోల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.800 వరకు విక్రయించారు. కనిష్టంగా రూ.600 వరకు అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌కు వచ్చిన ఉల్లి నాణ్యతగా, బాగా ఆరబెట్టింది కావడంతో చాలామంది వినియోగదారులు బస్తాలుగా కొనుగోలు చేశారు. ఉల్లి సీజన్ తర్వాత ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తుగానే తక్కువ ధరలో ఉల్లిని కొనే అవకాశం రావడంతో వినియోగదారులు ఎగబడ్డారు. వ్యాపారులు ఇదే అదునుగా మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని అంతా కొనుగోలు చేసి అమ్మకాలు సాగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్ అంతా సందడిగా మారింది.